## క్లుప్తంగా

### వాయుపుత్రుడికి పూజలు



కౌతాళం: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాలకు శనివారం భక్తులు అధికంగా తరలి వచ్చి పూజలు నిర్వహించారు. కౌతాళంతో పాటు అగసల దిన్నె గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి, సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుము లదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయం, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజనేయస్వామి దేవాలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. తెల్లవారుజామున అర్చకులు స్వామికి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలను చేపట్టారు.

### రీ సర్వేను పకడ్బందీగా చేపట్టాలి



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: రీ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ ఆదేశించారు. శనివారం ఆదోని పట్టణంలోని వీఎస్‌బీ ఫంక్షన్‌హాల్‌లో ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్టుకు సంబంధించి డివిజన్ స్థాయిలో రెవెన్యూ, సర్వే సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రీ సర్వే చేపట్టిందన్నారు. రీ సర్వేలో ఎలాంటి తప్పిదాలు లేకుండా సమస్యలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత రైతులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, శ్రీనివాస రాజు, రిటైర్డ్ తహసీల్దార్ ఈరన్న, ఉప తహసీల్దార్ రాజన్న తదితరులు పాల్గొన్నారు.

### సాహితీ స్రవంతి డివిజన్ కమిటీ ఎన్నిక



డాక్టర్ సక్కిరి భాస్కర్ అధ్యక్షుడు



జె.స్వయంప్రభలన ప్రధాన కార్యదర్శి

ఆదోని సెంట్రల్: సాహితీ స్రవంతి డివిజన్ నూతన కమిటీ ఎన్నిక శనివారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో జరిగింది. ఆదోని డివిజన్ అధ్యక్షుడిగా డాక్టర్ సక్కిరి భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా జె.స్వయంప్రభలను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షులుగా ఎం.నాగమణి, సహాధ్యక్షులు బత్తిని మహాదేవి, కోశాధికారిగా ఎం.ఓంకార్, సంయుక్త కార్యదర్శిగా జి.రామలక్ష్మి, గౌరవ సలహాదారుగా ఎం.షేక్షావలి పాటు పలువురు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

### యువకుడిపై కేసు నమోదు

ఆదోని అర్బన్: పట్టణంలోని రాయనగర్‌కు చెందిన భూపతి అనే యువకుడిపై వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 24వ తేదీన రాయనగర్ సమీపంలో ఆదోని నుంచి ఉప్పరహాల్ గ్రామానికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ వెంకటేష్‌పై యువకుడితోపాటు మరో ఇద్దరు దాడి చేశారు. బస్సు డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ పోలీసులు తెలిపారు.

### అభివృద్ధి పనులు చేపట్టాలి

నందవరం : మండల పరిధిలోని హాలహర్వి గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టాలని బీజేపీ నాయకులు నారాయణ డిమాండ్ చేశారు. శనివా రం హాలహర్వి గ్రామంలో పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలో సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపీడీఓ వుల్లయ్యకు బీజేపీ నాయకులు వినతి పత్రం అందజేశారు.

### ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్లు

ఆస్పరి: ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని పత్తికొండ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రఘురామిరెడ్డి అన్నారు. శనివారం కలపరి గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఎంపీడీఓ గీతావాణితో కలిసి పరిశీలించి రోగులతో మాట్లాడారు. పత్తికొండ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ఆదినాగేష్, డాక్టర్లు దుర్గాబాయి, బాలకృష్ణారెడ్డి, వైద్య సిబ్బంది గ్రామంలో 40 మంది రోగులను పరీక్షించి మందులను పంపిణీ చేశారు. రోగులకు అందుబాటులో ఉండి వైద్యం అందిస్తామని.. ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఇంటి పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యమన్నారు. గ్రామంలోని వీధులన్నీ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ గీతావాణి యాటకల్లు సర్పంచ్ సుధమ్మకు సూచించారు.

# ఈ-కేవైసీ గుబులు !

- రేషన్ కార్డుదారులకు కొత్త కష్టాలు
- ఈ-కేవైసీ చేయించుకోవాలని ప్రభుత్వ ఉత్తర్వులు
- లేదంటే కార్డు రద్దంటూ ప్రచారం
- ఈనెల 30 ఆఖరి గడువు
- రేషన్ షాపుల వద్దకు జనం పరుగులు



పెద్దకడబూరులో ఈకేవైసీ చేస్తున్న డీలర్ దేవప్ప

పెద్దకడబూరు : రేషన్ కార్డుదారుల్లో ఈ-కేవైసీ (ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్) గుబులు మొదలైంది. రేషన్ కార్డుదారులో పేర్లున్న వారందరూ సమీపంలోని డీలర్ల దగ్గరకు వెళ్లి ఈ-కేవైసీ చేయించుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు మరో నాలుగు రోజుల్లో గడువు ముగుస్తుండడంతో రేషన్ షాప్‌ల వద్దకు పరుగు పెడుతున్నారు. ఈ-కేవైసీ చేయించుకోకపోతే కార్డు రద్దు చేస్తారంటూ ప్రచారం జరుగుతుండడంతో ఆందోళనకు గురవుతున్నారు.

**డీలర్ల కోసం వెతుకులాట..**

ఏదైనా కారణాల వల్ల ఎవరైనా ఈ-కేవైసీ చేయించుకోకపోతే కార్డుదారులకు రేషన్ నిలిపివేస్తారని, సంక్షేమ పథకాల అమలులో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని ప్రభుత్వం ప్రకటించడంతో ప్రజలలో తీవ్రమైన ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటి వరకు ఎండీయూ వాహనాల ఆపరేటర్లు ఇంటి వద్దకే వచ్చి రేషన్ పంపిణీ చేస్తుండడంతో ప్రజలు డీలర్ల దగ్గరకు వెళ్లాల్సిన అవసరం ఉండేది కాదు. ఇప్పుడు డీలర్లు ఎక్కడ ఉన్నారో, ఎప్పుడు ఉంటారో కార్డుదారులు వెతుక్కోవాల్సిన పరిస్థితి. ఈ-కేవైసీకి ఈ నెల 30వ తేదీ వరకు గడువు ఇచ్చారు. ఇందుకు కేవలం 4రోజులే ఉండడంతో డీలర్ల వద్దకు ప్రజలు పరుగులు పెడుతున్నారు.

మండలంలో మొత్తం 16,578 రేషన్ కార్డులు ఉన్నాయి. గత రెండు నెలలుగా ఈ ప్రక్రియ నడుస్తున్నా ఇంకా 5,200లకు పైగా కార్డుదారులు ఈ-కేవైసీ చేయించుకోవాల్సి ఉంది. ఈ-కేవైసీ చేయించుకోని వారందరికీ వచ్చేనెల నుంచి రేషన్ అందేవ రిస్థితి లేదని అధికారులు చెబుతున్నారు.

**కార్డు లేకపోతే సంక్షేమ పథకాలు లేనట్లే**

ప్రతినెలా రేషన్ తీసుకోవాలంటే రేషన్ కార్డులు ఉండాలి. అలాగే పెన్షను, పక్కా గృహాలు, వైద్య సేవలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, తల్లికి వందనం తదతర సేవలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలు అందాలంటే రేషన్ కార్డులు తప్పనిసరి. అలాంటి రేషన్ కార్డు రద్దు అయితే ఆ కుటుంబం జీవనం కష్టంగా మారుతుందనడంలో ఎటువంటి సందేహం లేదు. ఇప్పటికే మండలంలో కొత్తగా పెళ్లి చేసుకున్నవారుతో పాటు అనేక మంది రేషన్ కార్డులు లేని కుటుంబాలు ఉన్నాయి. అర్హులైన వీరందరూ కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం కొత్త కార్డులు జారీచేయకపోగా ఈ-కేవైసీ పేరుతో తక్కువ గడువు ఇవ్వడమంటే ఉన్న కార్డులను తొలగించడమేనన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎంతమందికి ఈ-కేవైసీ లేకపోతే అంతమందికి సంక్షేమ పథకాలు దూరమయ్యే ప్రమాదం ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకొని ఈ-కేవైసీ గడువును పొడగించాలని పలువురు కోరుతున్నారు.

**వలసదారుల ఆవేదన**

మండలంలోని పలు గ్రామాలలో చాలామంది ప్రజలు బతుకుతెరువు కోసం తాత్కాలికంగా ఇతర ప్రాంతాలకు వలసవెళ్లారు. అలాంటి వారు ఈ-కేవైసీ చేసుకోవడం కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇది కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం కనుక దేశంలో ఎక్కడైనా డీలర్ల దగ్గర ఈ-కేవైసీ చేసుకునే అవకాశం ఉందని అధికారులు అంటున్నా.. ఇది ఆచరణలో అమలు కావడం అంత సులభం కాదు. రేషన్ కార్డు పోతుందనే భయంతో వలసదారులు చాలామంది స్వగ్రామాలకు వస్తున్నారు.

**గడువు పొడిగించాలి**



ప్రభుత్వాలు మారిన ప్పుడల్లా ఒక్కొక్క నిర్ణయం తీసుకొని ఈ-కేవైసీ చేయించుకోవాలని లేకపోతే రేషన్ కార్డు రద్దు అవుతుందని చెప్పడం తగదు. ఎందుకంటే కుటుంబ పోషణ కోసం చాలామంది ప్రజలు వలస వెళ్లారు. అలాంటివారు ఈ-కేవైసీ చేయించుకోవడం కష్టం అవుతుంది. వారిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వాలు ఈ-కేవైసీ గడువును పెంచాలి.

– పరమేష్, సీపీఎం సీనియర్ నాయకులు

**అన్ని విధాలుగా అవగాహన కల్పించాం**



రేషన్ కార్డులు అప్డేట్ కోసం ప్రభుత్వం తీసుకున్న ఈ-కేవైసీ నిర్ణయాన్ని ప్రజలకు అన్ని విధాలుగా తెలియజేశాం. డీలర్ల ద్వారా కూడా తెలియజేశాం. చాటింపుల ద్వారా, పేపర్ల ప్రకటన ద్వారా తదితర అన్ని విధాలుగా ప్రజలకు సమాచారం అందేవిధంగా చర్యలు తీసుకున్నాం. ఈ-కేవైసీ చేయించుకోవడానికి ఈనెల 30వ తేదీ వరకు గడువు ఉంది. అయినా ప్రజలు ముందుకు రావడం లేదు. మండలంలో ఇంకా 5వేలకు పైగా కార్డుదారులు ఈ-కేవైసీ చేయించుకోవాల్సి ఉంది.

– గీతాప్రియదర్శిని, తహసీల్దారు

### మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు

కోసిగి: 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు కోసిగిలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియెట్ అడ్మిషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సమీరారెడ్డి తెలిపారు. పాఠశాలలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఇంగ్లిష్ మీడియం బోధన ఉంటుందన్నారు. ఎంపీసీ, బైపీసీ , ఎంఈసీ, సీఈసీ గ్రూపులు ఉన్నాయన్నారు. ప్రతి గ్రూపునకు 40 సీట్లు కేటాయించినట్లు చెప్పారు. 10వ తరగతి ఉత్తీర్ణులు అయిన వారు ఆన్‌లైన్ ఎస్సీ, ఎస్టీలు, రూ.150 , ఓసీ, బీసీలు రూ.200 ఫీజు చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. 10వ తరగతిలో వచ్చిన మెరిట్ జాబితా ఆధారంగా ఎంపిక చేయబడుతుందన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు మే 22 చివరి తేదీ అని తెలిపారు.

### అన్న క్యాంటీన్ పరిశీలన

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో ఉన్న అన్న క్యాంటిన్‌లో భోజన పంపిణీని శనివారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు. ఇందులో భాగంగా భోజన నాణ్యత గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలిచ్చారు. మున్సిపల్ ఏఈ శరత్ చంద్ర పాల్గొన్నారు.

### సర్వేయర్లు, ఇంజినీర్లు లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకోండి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణ పరిధిలో భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేయడానికి ఆసక్తి వున్న టెక్నికల్ సర్వేయర్లు, ఇంజినీర్లు లైసెన్స్‌ల కోసం దరకాస్తులు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి శనివారం సూచించారు. ఇందుకు ఐటీఐలో సివిల్, డిప్లొమాలో సివిల్, లేదా బీటెక్‌లో సివిల్ కోర్స్ పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. విద్యార్హతలు కలిగిన వారు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## కంటిచూపుపై జాగ్రత్తలు అవసరం



మాట్లాడుతున్న ప్రముఖ కంటి వైద్యుడు హేమంత్‌కుమార్

ఎమ్మిగనూరుటౌన్: ప్రతి ఒక్కరు కంటి చూపు, కళ్ల పట్ల జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతైనా వుందని ప్రముఖ కంటి వైద్య నిపుణుడు హేమంత్ కుమార్ అన్నారు. ఈనెల 10న స్థానిక కలుగొట్ల రోడ్డులోని జీసెస్ టెంపుల్‌లో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 50 మందిని గుర్తించి స్థానిక ఆర్‌కే కంటి వైద్య శాలలో శస్త్ర చికిత్సలు చేశారు. ఇందులో భాగంగా శనివారం స్థానిక ఆర్‌కే ఆసుపత్రిలో నిర్వహించిన సమావేశంలో ఆయన శస్త్ర చికిత్సలు చేయించుకున్న రోగులకు పలు సూచనలిచ్చా రు. కార్యక్రమంలో స్థానిక ప్రముఖ వైద్యులు గౌడప్ప గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రదాడిపై నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ



ఎమ్మిగనూరులో సీపీఐ, ఎస్టీయూ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ

ఎమ్మిగనూరుటౌన్: కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడికి నిరసనగా శనివారం రాత్రి సీపీఐ, ఎస్టీయూ ఆధ్వర్యంలో పట్టణంలో పెద్ద ఎత్తున కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్ నుంచి సోమప్ప సర్కిల్ వరకు ర్యాలీ సాగింది. అక్క ఉగ్రదాడిలో మృతులకు నివాళులర్పించారు. సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, ఎస్టీయు నాయకులు పాల్గొన్నారు.

- పట్టణంలో సీపీఎం ఆధ్వర్యం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి తేరుబజార్‌లో ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి నివాళులర్పించారు. పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, రాముడు తదితరులు పాల్గొన్నారు.

ఆదోనిటౌన్: టీడీపీ నాయకులు భూపాల్‌చౌదరి, మారుతినాయుడు ఆధ్వర్యంలో శనివారం రాత్రి 8 గంటల సమయంలో ఎన్టీఆర్ విగ్రహం నుంచి పొట్టి శ్రీరాములు సర్కిల్ వరకు ఉగ్రవాదుల దాడులను నిరసిస్తూ, మృతుల ఆత్మలు శాంతించాలని ప్రార్థిస్తూ కొవ్వొత్తులతో ప్రదర్శన చేపట్టారు. అక్కడి నుంచి తిరిగి భీమాస్ సర్కిల్‌కు చేరుకుని మానవహారం నిర్వహించారు.

కౌతాళం: మండల కేంద్రం కౌతాళంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక త్రిలింగేశ్వర స్వామి దేవాలయం నుంచి కొవ్వొత్తులతో గ్రామ పురవీధుల గుండా ర్యాలీని చేపట్టి అంబేద్కర్ సర్కిల్‌లో మానవహారంగా నిలిచారు. గ్రామ పెద్దలు వెంకటపతిరాజు, గురు రాఘవేంద్ర రెడ్డి, వీరేశప్ప, రాజానందు, శ్రీరాం, రామచంద్ర, నరేష్‌లు ఉన్నారు.

### జయంతోత్సవాల కరపత్రాల విడుదల

ఆస్పరి: హలిగేర గ్రామ సమీపంలోని కొండల్లో వెలసిన కూర్మనారాయణ స్వామి క్షేత్రంలో స్వామి జయంతి ఉత్సవాల కరపత్రాలను శనివారం విడుదల చేశారు. జూన్ 7వ తేదీ కూర్మనారాయణ జయంతి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని నిర్వాహకుడు నరేష్ తెలిపారు. కరపత్రాలను జిల్లా ఆకాశవాణి ప్రోగ్రాం అసిస్టెంట్ డైరెక్టర్ మురళి, భక్తులు ప్రతాప్‌రెడ్డి, వెంకటరమణ, మల్లికార్జునరెడ్డి, వీరేష్, భమేష్ విడుదల చేశారు.

## ఉరుకుందలో ఎల్‌ఈడీ స్క్రీన్ల ఏర్పాటు



స్క్రీన్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి క్షేత్రంలో స్వామివారికి చేపట్టే సేవలు, పూజా కార్యక్రమాలను ప్రతి భక్తుడు కళ్లారా చూడాలనే ఉద్దేశంలో దేవాలయ ప్రాంగణంలో ఎల్‌ఈడీ స్క్రీన్‌లను (ప్రత్యేక పసారాల) ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. శనివారం ఎల్‌ఈడీ స్క్రీన్లు బిగించే పనులను చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. మొదటి విడతలో ప్రధాన రాజగోపురానికి ఇరువైపులా, ప్రధాన తూర్పు ద్వారం వద్ద, క్యూలైన్‌లో మొత్తం నాలుగు చోట్ల సుమారు 3లక్షలతో స్క్రీన్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆదివారం అమావాస్య ఉండడంతో వీటిని ఆదివారం నుంచే భక్తులకు అందుబాటులో తెస్తున్నట్లు వెల్లడించారు. అలాగే ఎండకాలాన్ని దృష్టిలో ఉంచుకుని భక్తుల సౌకర్యార్థం ఇప్పటికే చలువ పందిళ్లను ఏర్పాటు చేశామన్నారు.

## కర్ణాటక మద్యం స్వాధీనం



పట్టుబడిన మద్యం, నిందితుల అరెస్ట్ చూపుతున్న రూరల్ పోలీసులు

ఎమ్మిగనూరురూరల్: మండలంలోని పార్లపల్లి-పెసలదిన్నె గ్రామాల మధ్య నిల్వ ఉంచిన భారీ కర్ణాటక మద్యాన్ని శనివారం తెల్లవారుజామున రూరల్ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్ అవరణలో పట్టుబడిన మద్యం, నిందితులను అరెస్ట్ చూపించారు. రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు మాట్లాడుతూ మండల పరిధిలోని పార్లపల్లి గ్రామంలో ఈ నెల 30న జరిగే దేవరకు మద్యం విక్రయించాలని కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తీసుకొచ్చి నిల్వ ఉంచారనే సమాచారం మేరకు సిబ్బందితో తెల్లవారుజామున దాడి చేశామన్నారు. ఇందులో 8 బాక్సుల కర్ణాటక మద్యం ( 768 విస్కీ టెట్రా ప్యాకెట్లు) పట్టుకున్నామని చెప్పారు. పెసలదిన్నెకు చెందిన బోయ గోపాల్, పార్లపల్లికి చెందిన బోయ మునిస్వామి, దైవందిన్నెకు చెందిన బోయ రాజులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి మద్యంతో పాటు మూడు మోటార్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మద్యం విలువ రూ. 40 వేలకు పైగా ఉంటుందన్నారు. రూరల్ ఏఎస్ఐ ప్రాణేశ్వరరావు, హెడ్‌కానిస్టేబుల్స్, పీసీలు తదితరులు ఉన్నారు.

### ఉగ్రవాదులను ఉరి తీయాలి

ఆదోని టౌన్: పహల్గాంలో యాత్రికులను కాల్చి చంపిన ఉగ్రవాదులను ఉరి తీయాలని ఆదోని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ దేవిశెట్టి ప్రకాష్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. విహారయాత్రకు వెళ్లిన యాత్రికులను మతం పేరు అడిగి మరీ చంపిన తీవ్రవాదులను బహిరంగ ప్రదేశాల్లో ఉరి తీయాలన్నారు. ఉగ్రవాద సంస్థలను ప్రేరేపిస్తున్న పాకిస్తాన్‌కు సరైన సమాధానం ఇవ్వాలని భారత దేశ ఆర్మీకి దేశ ప్రధాని ఆదేశాలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తాయన్న, శేఖర్, రవి, జిలానీ తదితరులు పాల్గొన్నారు.

### వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆదోని టౌన్: స్థానిక గ్రంథాలయంలో నిర్వహించే వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని మేధాశక్తిని పెంపొందించుకోవాలని గ్రంథాలయ అధికారి సుజాత అన్నారు. ఈనెల 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు దాదాపు 40 రోజులపాటు ఉదయం 8 నుంచి 11 గంటల వరకు తరగతులు నిర్వహిస్తానర్నారు. ఇందులో పుస్తక పఠనం, నీతి కథలు చెప్పడం, విద్యార్థులచే సారాంశం చెప్పించడం, స్పోకెన్ ఇంగ్లిష్, చిత్రలేఖనం, పెయింటింగ్, క్రాఫ్ట్, ఆటలు తదితరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

### గ్రంథాలయంలో శిక్షణ తరగతులు

పెద్దకడబూరు: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో ఈనెల 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు వేసవిని పురస్కరించుకుని సమ్మర్ ఓరియెంటేషన్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారిణి కె. ఆశాజ్యోతి తెలిపారు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి 11గంటల వరకు తరగతులు ఉంటాయన్నారు. ఇందులో బుక్స్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్, గేమ్స్ అండ్ డ్యాన్స్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

### కార్మిక చట్టాల రక్షణకు పోరాడుదాం

ఆదోని రూరల్: మేడే స్ఫూర్తితో కార్మికుల చట్టాల రక్షణకు పోరాటాలు చేద్దామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి.అంజిబాబు, కార్యదర్శి పి.ఎస్.గోపాల్, సహాయ కార్యదర్శి లక్ష్మన్న పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సంఘం నాయకులతో సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ మే 1వ తేదీన మేడే ఉత్సవాలను కార్మికవర్గం జయప్రదం చేయాలని కోరారు. మేడే స్ఫూర్తితో కార్మిక హక్కులపై, చట్టాలపై దాడి చేస్తున్న కార్పొరేట్ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా, ఐక్యంగా ఉద్యమించాలన్నారు. సమావేశంలో నాయకులు రాజు, షేక్షావలి, నాగరాజు, శ్రీనివాసులు, యల్లప్ప, వీరేష్, ఎం.వీరేష్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

### గడ్డివామికి నిప్పు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కోటేకల్ గ్రామంలో జాలవాడి శ్రీనివాసులుకు చెందిన గడ్డివామికి శనివారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. గడ్డివామి కాలుతుండగా అటుగా వెళ్తున్న వారు గుర్తించి శ్రీనివాసులుకు సమాచారం అందించారు. గ్రామస్తులు గడ్డివాము దగ్గరకు వెళ్లి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. అలాగే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించటంతో ఆదోని నుంచి అగ్నిమాపక వాహనం వచ్చి మంటలను ఆర్పివేశారు. రూ. 40 వేల వరకు ఆస్తినష్టం జరిగిందని బాధితుడు తెలిపారు.

### విద్యాసంస్థల బ్యానర్లు తొలగించాలి

ఆదోని సెంట్రల్: పట్టణంలోని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల బ్యానర్లను తొలగించాలని ఏఐఎస్ఎఫ్ పట్టణ కోశాధికారి శేఖర్ డిమాండ్ చేశారు. శనివారం ఆదోని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణను కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఏఐఎస్ఎఫ్ పట్టణ కోశాధికారి శేఖర్ మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యను వ్యాపారంగా చేస్తూ వారి తల్లిదండ్రులను మభ్యపెట్టి కాలేజీ గొప్పలను ఫ్లెక్సీల రూపంలో ముందస్తు అడ్మిషన్లకు పాల్పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభావంతులకు సబ్‌కలెక్టర్ అభినందన





విద్యార్థిని అభినందిస్తున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ప్రశంసా పత్రం అందుకుంటున్న షేక్ అఫ్రీన్

ఆదోని రూరల్: ఆదోని డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అభినందించారు. శనివారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో డిప్యూటీ డీఈఓ వెంకటరమణారెడ్డి, ఎంఈఓ శ్రీనివాసులు వారి ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేసి ఉత్తమ మార్కులు సాధించిన 9 మంది విద్యార్థులకు సబ్‌కలెక్టర్ చేతులమీదుగా బహుమతులు అందజేశారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ఈ విజయాన్ని సాధించిన ప్రతి విద్యార్థి భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. నిరంతరం కొత్త నైపుణ్యాలను అభ్యసిస్తూ, వ్యక్తిత్వ వికాసాన్ని సాధిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవాలన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులకు అందించిన మద్దతుకు సబ్‌కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన ఆదోని మండలం ఆరేకల్ గ్రామంలోని మహాత్మాజ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకుల పాఠశాల 76 మంది విద్యార్థులను, ఎమ్మిగనూరు మండలం బనవాసి గ్రామంలోని ఏపీ ఆర్ఎస్ పాఠశాలలోని 79 మంది విద్యార్థులను, ప్రిన్సిపాళ్లు యమునాదేవి, సామ్రాజ్యాన్ని సబ్‌కలెక్టర్ శాలువా వేసి సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**బదినేహాల్ విద్యార్థికి..**

కౌతాళం: ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్షల్లో మండల టాపర్‌గా నిలిచిన బదినేహాల్ జెడ్పీ పాఠశాల విద్యార్థి మహమ్మద్‌యాసీన్‌ను శనివారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్, ఆదోని డివిజన్ విద్యాధికారి వెంకటరమణరెడ్డి అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హరినాథరావు, ఉపాధ్యాయుడు శశిధర్ పాల్గొన్నారు.

**షేక్ అఫ్రీన్‌కు ప్రశంసా పత్రం**

కోసిగి: ఇటీవల విడుదల చేసిన 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మండలంలోని దుద్ది గ్రామానికి చెందిన షేక్ అఫ్రీన్ 555 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. శనివారం ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డిప్యూటీ డీఈఓ వెంకట్రాముడు చేతుల మీదుగా దుద్ది హైస్కూల్ హెచ్‌ఎం రాము డు సమక్షంలో విద్యార్థిని తండ్రి షబ్బీర్, విద్యార్థినికి ప్రశంసా పత్రం అందించి అభినందించారు.

**నందవరం విద్యార్థికి సన్మానం**

నందవరం : ప్రభుత్వ పాఠశాలలో చదివి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలో 578 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచిన శేవంత్ ఆచారిని శనివారం ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సన్మానించి బహుమతి అందజేశారు. తల్లిదండ్రులు బసవరాజు, రాజేశ్వరి సంతోషం వ్యక్తం చేశారు.



కౌతాళం విద్యార్థి మహమ్మద్ యాసీన్‌తో సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్



నందవరం మండలానికి చెందిన శేవంత్ ఆచారికి బహుమతి అందజేస్తున్న సబ్ కలెక్టర్

## ప్రమాదాల నివారణకు సహకరించాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు

ఆదోని అర్బన్: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు కోరారు. శనివారం ప్రమాద రహిత దినోత్సవం (ప్రతి శనివారం) కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని అభయ ఆంజనేయస్వామి ఆలయం వద్ద వాహనదారులకు ట్రాఫిక్ నియమాలు, నిబంధనలు, హెల్మెట్ ధరించడం, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే పర్యావసనాలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. వాహనదారులు ఎవరికి వారు అప్రమత్తంగా ఉండి ట్రాఫిక్ నియమాలు పాటిస్తే ఎలాంటి ప్రమాదాలు జరగవన్నారు.